సాక్షి ఖమ్మం

ఆదివారం । 9 । ఏప్రిల్ । 2023



టన్నెల్ పనులు షురూ..

సీతారామ ప్రాజెక్టులో భాగంగా యాతాలకుంట వద్ద టన్నెల్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. 10లో



కోవిడ్ కట్టడికి సన్నద్ధత

కోవిడ్ కేసులు నానాటికీ పెరుగుతుండడంతో పరీక్షల నిర్వహణ, జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్సకు ఏర్పాట్లు చేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
39° / 23°

వాతావరణం

ఆదివారం జిల్లాలో ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఉదయం నుంచే ఎండ మొదలై గంటగంటకు పెరుగుతుంది.



న్యూస్‌రీల్

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్



విద్యార్థుల వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

ఖమ్మం సహకారనగర్: జేఈఈ మెయిన్స్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంలో మూడు కేంద్రాలు ఏర్పాటుచేయగా, రెండో రోజైన శనివారం రెండు సెషన్లలో పరీక్ష జరిగింది. ఈసందర్భంగా ఉదయం పరీక్షకు 270మంది అభ్యర్థుల్లో 264మంది, మధ్యాహ్నం పరీక్షకు 270మంది విద్యార్థుల్లో 266మంది హాజరయ్యారని పరీక్షల సిటీ కోఆర్డినేటర్ పార్వతీరెడ్డి తెలిపారు.

నేడు నెట్‌బాల్ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి నెట్‌బాల్ జూనియర్, సబ్ జూనియర్ బాలబాలికల జట్ల ఎంపిక కోసం ఆదివారం పోటీలు నిర్వహిస్తున్నట్లు నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.ఫణికుమార్ తెలిపారు. ఈ ఎంపిక పోటీలు ఖమ్మంలోని సెయింట్ జోసఫ్ హైస్కూల్‌లో జరగనుండగా, నల్లగొండ, హైదరాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాల క్రీడాకారులు హాజరుకావొచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు వయసు ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డుతో రావాలని సూచించారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన వారితో జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర జట్లను ఎంపిక చేస్తామని తెలిపారు.

22 అడుగులకు చేరిన పాలేరు



కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం శనివారం 22అడుగులకు చేరింది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా ఇంకో అడుగు దూరంలో ఉంది. సాగర్ నుండి రిజర్వాయర్‌కు 2,505 క్యూసెక్కుల నీరు చేరుతుండగా, 1,458 క్యూసెక్కులను రెండో జోన్ పరిధిలో ఆయకట్టుకు, పాలేరు కాల్వకు 210 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం వరి పొలాలు చేతికి వస్తుండటంతో నీటి వినియోగం తగ్గుతుండగా, రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నింపి వేసవిలో తాగునీటి అవసరాలకు ఉపయోగించనున్నారు.



ఇంకెవరికైనా ఇచ్చారా?

- జిల్లాలో డీఏఓ ప్రశ్నాపత్రం లీకేజీ కలకలం
- ఇప్పటికే ఖమ్మంకు చెందిన దంపతుల అరెస్టు
- విచారణ ముమ్మరం చేసిన 'సిట్'

సాక్షిప్రతినిధి, ఖమ్మం: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించగా ఆ ఆనవాళ్లు జిల్లాలోనూ బయటపడ్డాయి. డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్(డీఏఓ) ప్రశ్నపత్రాన్ని జిల్లాకు చెందిన దంపతులు కొనుగోలు చేసినట్లు వెలుగులోకి రావడం సంచలనం కలిగించింది. జిల్లాకు చెందిన కార్ల వ్యాపారి సాయిలౌకిక్ తన భార్య సుస్మిత కోసం ప్రశ్నపత్రాన్ని రూ.10లక్షలకు కొనుగోలు చేసినట్లు సిట్ విచారణలో వెలుగు చూడడంతో వారిద్దరిని శుక్రవారం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అయితే, ప్రశ్నపత్రాన్ని సుస్మిత కోసమే కొనుగోలు చేసినా, ఆతర్వాత ఇంకా ఎవరికైనా ఇచ్చారా అనే అంశంపై సిట్ ప్రధానంగా దృష్టి సారించింది.

ముమ్మరంగా సిట్ విచారణ

పలు ఉద్యోగాలకు సంబంధించి ప్రశ్నపత్రాలు లీకేజీ అయినట్లు తేలగా.. సిట్ విచారణ చేపడుతోంది. ఇందులో భాగంగా డీఏఓ ప్రశ్నపత్రం బయటకు వచ్చినట్లు గుర్తించిన అధికారులు మరింత సమాచారం రాబట్టేందుకు యత్నిస్తున్నారు. పరీక్షపత్రం కొనుగోలు చేసిన సాయిలౌకిక్, సుస్మితను అదుపులోకి తీసుకున్న సిట్ బృందం... రూ. 10 లక్షలు వెచ్చించి వీరి కోసమే కొనుగోలు చేశారా, మరెవరికైనా ఇచ్చారా అనే కోణంలో విచారణ చేపట్టినట్లు తెలిసింది. అంత సొమ్ము వెచ్చించి ఒకరి కోసమే కొనుగోలు చేసి ఉండరనే భావనకు వచ్చిన సిట్ అధికారులు వెనుక ఎవరెవరు ఉన్నారనే అంశంపై ఆరా తీస్తున్నట్లు సమాచారం.

అభ్యర్థుల్లో ఆవేదన

డీఏఓ ప్రశ్నపత్రం లీక్ కావడంతో ఇప్పటికే పరీక్షను టీఎస్‌పీఎస్సీ రద్దు చేసిన విషయం విదితమే. అయితే ఈ వ్యవహారంలో జిల్లాకు చెందిన ఇద్దరు ఉండడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చర్చ జరుగుతోంది. మరోవైపు పరీక్ష రాసిన నిరుద్యోగుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. డీఏఓ (డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్) పరీక్ష ఫిబ్రవరి 26వ తేదీన 27 కేంద్రాల్లో రెండు సెషన్లలో నిర్వహించారు. మొత్తం 9,426 మంది అభ్యర్థులకు గాను ఉదయం సెషన్‌లో 6,478 మంది, మధ్యాహ్నం పరీక్షకు 6,404 మంది హాజరయ్యారు. ఎంతో కష్టపడి శిక్షణ తీసుకుని పరీక్ష రాస్తే ఫలితం లేకుండా పోయిందని అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు.

ఆదాయానికి అడ్డదారులు

- సీఎంఆర్ఎఫ్ అండగా అక్రమార్కుల స్కెచ్
- సీసీఎస్ విచారణలో వెలుగులోకి 'నకిలీ' దందా
- బీమా బిల్లులపై కూడా ఆరోపణలు
- ఖమ్మంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులపై నిఘావర్గాల ఆరా

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అక్రమార్జనకు కొందరు అడ్డదారులు తొక్కుతున్నారు. ఇన్నాళ్లు పలు రంగాల్లో చోటుచేసుకున్న అక్రమాలు ఇప్పుడు వైద్యరంగానికి తాకాయి. నకిలీ మెడికల్ బిల్లులతో సీఎంఆర్ఎఫ్ నిధులను కాజేసిన అంశంపై ఖమ్మంలోని శ్రీ వినాయక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు తాజాగా కేసు నమోదు చేశారు. అయితే, ఇతర ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ ఇలాంటి వ్యవహారాలు నడిచినట్లు తెలుస్తుండగా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇదేసమయాన కొందరు హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలను క్లెయిమ్ చేసుకునేందుకు పలు ఆస్పత్రుల నుంచి నకిలీ బిల్లులు పొందారనే ప్రచారంతో ఆ కోణంలోనూ విచారణ చేపట్టారు.

నకిలీ బిల్లులపై సీసీఎస్ విచారణ

కొందరు వ్యక్తులు.. ఆస్పత్రుల సిబ్బందితో కుమ్మక్కై నకిలీ మెడికల్ బిల్లులతో సీఎంఆర్ఎఫ్ నిధులు పొందినట్లు గతనెల 21న హైదరాబాద్‌లోని సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో సచివాలయ అధికారి ఫిర్యాదు చేశారు. కేసు తీవ్రత దృష్ట్యా దీన్ని సీసీఎస్‌కు బదిలీ చేయగా.. విచారణ ముమ్మరం చేశారు. ఇప్పటికే ఖమ్మంలోని శ్రీ వినాయక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై కేసు నమోదు చేసి తనిఖీ కూడాచేశారు. ఇదే సమయాన నగరంలోని మరికొన్ని ఆస్పత్రులపై కూడా ఆరోపణలు వస్తుండటంతో సీసీఎస్ పోలీసులు దృష్టి సారించారు.

పరిశీలించకుండానే..

సీఎం రిలీఫ్‌ఫండ్ కోసం వచ్చిన దరఖాస్తులకు సంబంధించి కొన్నిసార్లు క్షేత్రస్థాయి విచారణ లేకుండానే మంజూరు చేస్తున్నట్లు తెలుస్తోంది. దరఖాస్తులను సచివాలయం రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లోని సెక్షన్‌లో తనిఖీ చేసి, బిల్లులు వాస్తవమేనని నిర్ధారించుకునేందుకు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలి. కానీ అలా జరగకుండానే నిధులు విడుదల చేస్తుండడంతో కొన్నిసార్లు దుర్వినియోగమవుతున్నాయనే ఆరోపణలున్నాయి. ప్రధానంగా ఉద్యోగులు కాని వ్యక్తుల క్లెయిమ్‌ల్లో ఇలాంటి దందాకు ఆస్కారముంటుందని తెలుస్తోంది.

వైద్య, ఆరోగ్యశాఖ ప్రేక్షకపాత్ర

జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల వ్యవహారాన్ని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఆస్పత్రుల్లో చికిత్స, వాడుతున్న మందులు, ఇతర అంశాలను పర్యవేక్షించాల్సి ఉన్నా ఏదైనా ఘటన జరిగినప్పుడే తనిఖీలు చేయడం, ఆతర్వాత వదిలేయడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం ఓ ఆస్పత్రిపై నకిలీ మెడికల్ బిల్లులకు సంబంధించి కేసు నమోదు కావడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

హెల్త్ పాలసీల్లోనూ..

హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీల్లోనూ ఇదే తరహా మోసాలు జరుగుతున్నట్లు సమాచారం. సీఎంఆర్ఎఫ్ అవకతవకలు వెలుగు చూసిన నేపథ్యాన కొన్ని ఆస్పత్రుల్లో జరుగుతున్న హెల్త్ ఇన్సూరెన్స్ బాగోతంపై కూడా చర్చ మొదలైంది. పాలసీ తీసుకున్న కొందరు.. ఆస్పత్రుల్లోని సిబ్బందితో కుమ్మక్కై, చికిత్స పొందినట్లు నకిలీ బిల్లులు తీసుకుని క్లెయిమ్ చేసుకుంటున్నట్లు సమాచారం. ప్రైవేట్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీలు ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నా, కొందరు బీమా పరిహారం పొందారనే సమాచారంతో పోలీసులు సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది.

ఉద్యోగులు కానివి మా దగ్గరకు రావు



సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులు మాతో సంబంధం లేకుండానే పైకి వెళ్తాయి. వీటికి సంబంధించి మా దగ్గర ఎప్పుడు పరిశీలన జరగదు. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన మెడికల్ రీయింబర్స్‌మెంట్ ఫైల్స్ మాత్రమే మా దగ్గరకు వస్తాయి. రూ.50 వేలు బిల్లులైతే మేం పరిశీలించి ప్రభుత్వ ఆస్పత్రికి పంపిస్తాము. ఆపైన బిల్లులైతే డైరెక్టరేట్‌కి పంపిస్తాం. ఇక ఉద్యోగులు కాని వ్యక్తుల బిల్లులేవీ మా దగ్గరకు రావు.

– డాక్టర్ మాలతి, డీఎంహెచ్ఓ

ఎన్నాళ్లకెన్నాళ్లకు!

- 30ఏళ్ల తర్వాత ఈఎస్ కార్యాలయానికి ప్రభుత్వ భవనం
- ఎన్నెస్పీ క్యాంపులో కేటాయించిన కలెక్టర్
- మరమ్మతులు పూర్తికాగానే ప్రారంభం



ఎన్నెస్పీ క్యాంపులో ఈఎస్ కార్యాలయానికి కేటాయించిన భవనం

ఖమ్మంక్రైం: ఎన్నో ఏళ్ల తర్వాత జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్(ఈఎస్) కార్యాలయం అద్దె భవనం నుంచి ప్రభుత్వ భవనంలోకి మారనుంది. జిల్లా కేంద్రంలోని ఎన్నెస్పీ క్యాంపులో సుమారు వెయ్యి గజాల్లో ఉన్న భవనాన్ని ఈఎస్ కార్యాలయానికి కేటాయించారు. ఈ విషయమై ఉత్తర్వులు వెలువడడంతో అవసరమైన మరమ్మతులు చేయిస్తున్నారు.

ముప్పై ఏళ్ల తర్వాత...

తొలినాళ్లలో కలెక్టర్ కార్యాలయంలోనే ఈఎస్ కార్యాలయం ఉండేది. అయితే, ప్రత్యేక విభాగం కావడంతో కొన్నాళ్ల తర్వాత కార్యాలయాన్ని బయట అద్దె భవనంలోకి తరలించారు. అలా ముప్పై ఏళ్ల నుంచి అద్దె భవనంలోనే కొనసాగుతున్న ఈఎస్ కార్యాలయం ప్రస్తుతం పోలీస్ హౌసింగ్ కాలనీలో ఉంది.

కలెక్టర్ చొరవతో....

ఎక్సైజ్ ఈఎస్ కార్యాలయానికి ప్రభుత్వ భవనం కేటాయించాలని జిల్లా ఎక్సైజ్ అధికారి నాగేందర్ రెడ్డి ఇటీవల కలెక్టర్ గౌతమ్‌ను కలిసి విన్నవించారు. దీంతో కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని ఎన్నెస్పీ ఆవరణలో ఖాళీగా ఉన్న భవనాన్ని కేటాయించారు.

త్వరలోనే మార్పు

జిల్లా ఎక్సైజ్ అధికారి కార్యాలయం త్వరలోనే ఎన్నెస్పీ క్యాంప్‌లో కేటాయించిన భవనంలోకి మారనుంది. ఈ భవనంలో అవసరమైన మరమ్మతులు కొనసాగుతున్నాయి. పనులు పూర్తయ్యాక ఇక్కడి నుంచే ఈఎస్‌తోపాటు, ఇద్దరు ఏఈఎస్‌లు, మినిస్టీరియల్ సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. కాగా, ఇదే భవనానికి ఎక్సైజ్ స్టేషన్ -1 కార్యాలయం భవనం కూతవేటు దూరంలో ఉండగా, ఆ వెనుక ఉమ్మడి జిల్లాల ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం కూడా నిర్మించనున్నారు. ప్రభుత్వం నిధులు కేటాయించగానే నిర్మాణ పనులు చేపట్టనున్నారని తెలుస్తోంది. ప్రసుత్తం అక్కడే ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం కొనసాగుతోంది. ఏదిఏమైనా చాన్నాళ్ల తర్వాత ఈఎస్ కార్యాలయానికి ప్రభుత్వం భవనం కేటాయించడంతో ప్రభుత్వంపై అద్దె భారం తగ్గడమే కాక ఉద్యోగులు సాఫీగా విధులు నిర్వర్తించే మార్గం సుగమం కానుంది. హర్షం వ్యక్తమవుతోంది.

శ్రీవారికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రీస్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్ఛరణల నడుమ పంచామృతాలతో శ్రీవారి పాదానికి అభిషేకం చేశాక, స్వామి, అమ్మవార్లను అలంకరించి వేలాదిగా హాజరైన భక్తుల సమక్షాన నిత్యకల్యాణం జరిపించారు. ఆతర్వాత అర్చకులు, భక్తులు శ్రీవారికి పల్లకీసేవ నిర్వహించగా భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ఉద్యోగులు శ్రీనివాస్, కొతా విజయకుమారి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదు

డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్



కాంగ్రెస్ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న దుర్గాప్రసాద్, నాయకులు

నేలకొండపల్లి: రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని అప్పలనరసింహాపురంలో శనివారం హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న పాలేరులో అత్యధిక మెజార్టీతో అభ్యర్థిని గెలిపించేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సందర్భంగా కేసీఆర్ ఇచ్చిన హామీలు ఏవీ అమలుకానందున ఆ పార్టీకి గుణపాఠం చెప్పేలా ప్రజలు తీర్పు ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఇదేసమయాన అన్ని ధరలు పెంచి ప్రజలను ఇబ్బంది పెడుతున్న బీజేపీకి జిల్లాలో ఒక్క సీటు కూడా రాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, నాయకులు బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, బోయిన వేణు, యడవల్లి నాగరాజు, యాతాకుల శ్రీనాథ్, ఆరెకట్ల గురవయ్య, సూరేపల్లి రవి, చిన్నానాయక్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిని కాపాడుకుందాం

- కేంద్ర ప్రభుత్వ కుట్రను తిప్పికొట్టండి
- మహాధర్నాలో మంత్రి పువ్వాడ పిలుపు
- హాజరైన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు



మాట్లాడుతున్న మంత్రి అజయ్‌కుమార్, చిత్రంలో ఎంపీ వద్దిరాజు, విప్ కాంతారావు, ఎమ్మెల్యేలు సండ్ర, హరిప్రియ తదితరులు

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ సిరుల గని అయిన సింగరేణికి చెందిన నాలుగు బొగ్గు బ్లాకులను ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, సింగరేణి కార్మికులు, కార్మిక సంఘాలు ఐక్యంగా ఉద్యమించి సంస్థను కాపాడుకోవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సింగరేణి బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ, ప్రధాని నరేంద్రమోదీ హైదరాబాద్ పర్యటనకు నిరసనగా శనివారం కొత్తగూడెంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ సింగరేణి ప్రైవేటీకరణ ప్రయత్నాలను ఆపాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసినా ప్రధాని మోదీ కుట్రపూరితంగా వ్యవహరిస్తూ వేలంను మరోసారి తెరపైకి తెచ్చారని విమర్శించారు. ఇప్పటికే పలు మార్లు వేలానికి ప్రయత్నం చేసినా ప్రైవేట్ కంపెనీల నుంచి స్పందన రాలేదన్నారు. ఇప్పటికైనా కేంద్రం దిగివచ్చి సింగరేణి గనుల ప్రైవేటీకరణ యత్నాన్ని మానకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ నౌకాదళం, ఎయిర్‌పోర్టు, ఎల్ఐసీ, బ్యాంకింగ్ వంటి ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయడమే కాక సింగరేణిని కూడా అమ్మేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. రూ.50కోట్ల బడ్జెట్‌ను 12 నిమిషాల్లో తేల్చి, అందులోని అంశాల గురించి ప్రతిపక్ష నాయకులు మాట్లాడకుండా చేశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు మాట్లాడుతూ తెలంగాణను దెబ్బ కొట్టేందుకే కేంద్ర ప్రభుత్వం సింగరేణిని ప్రైవేటీకరించేందుకు యత్నిస్తోందని అన్నారు. లాభాల్లో నడుస్తున్న అనేక ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తోందన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను కూడా దివాలా తీయించిన కేంద్రం.. అదే విష ప్రయోగాన్ని సింగరేణిపై అమలుచేయాలని చూస్తోందన్నారు. పోరాటాల పురిటిగడ్డ అయిన తెలంగాణలో మోదీ ఆటలు సాగనివ్వమని స్పష్టం చేశారు. టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావ్ మాట్లాడుతూ 133 సంవత్సరాల ఘన చరిత్ర గల సింగరేణి గనులను ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే కార్మిక సంఘాలన్నీ ఐక్యమై ఉద్యమిస్తామని హెచ్చరించారు. కేంద్రం వైఖరితో తెలంగాణ చీకటిమయం అవుతుందని, కార్మికులు శ్రమదోపిడీకి గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు, ఎమ్మెల్యేలు బానోత్ హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, రాములునాయక్, సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్‌రెడ్డి, ఖమ్మం మేయర్ నీరజ, ఇల్లెందు, కొత్తగూడెం మున్సిపల్ చైర్మన్లు డి.వెంకటేశ్వర్లు, సీతాలక్ష్మి, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా చైర్మన్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు ఘనంగా సువర్ణ తులసీ అర్చన



స్వామివారి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన పూజలు చేశారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపించారు. ఆతర్వాత వేలాది మంది భక్తుల సమక్షాన నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

దివ్యబలి పూజ

ఏసుక్రీస్తు పునరుత్థానం సందర్భంగా క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ వేడుకలు జరుపుకోనున్నారు. ఈసందర్భంగా శనివారం అర్ధరాత్రి నుంచే చర్చిల్లో ప్రారంభమయ్యాయి. ఈమేరకు వైరాలోని ఆర్‌సీఎం చర్చిల్లో ఫాదర్ జ్వాన్నేసు ఆధ్వర్యాన దివ్యబలి పూజ సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో క్రైస్తవులు ఈ ప్రార్థనలకు హాజరయ్యారు. – వైరా





ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు (ఇన్‌సెట్) దివ్య బలిపూజ సమర్పిస్తున్న ఫాదర్ జ్వాన్నేసు

క్లుప్తంగా

ఎస్సెస్సీ పరీక్షకు 52 మంది గైర్హాజరు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో పదో తరగతి పరీక్షలు పకడ్బందీ పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. ఈమేరకు శనివారం జిల్లాలోని 103 పరీక్ష కేంద్రాల్లో 16,873మంది విద్యార్థులకు 16,821మంది హాజరు కాగా 52మంది గైర్హాజరయ్యారని డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు. రెండు పరీక్ష కేంద్రాలను కలెక్టర్ గౌతమ్, డీఈఓ ఆరు కేంద్రాలను, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ రెండు కేంద్రాలను తనిఖీ చేశారు.

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా



మాట్లాడుతున్న కృష్ణయ్య

ఖమ్మంమామిళ్లగూడెం: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కల్యాణం కృష్ణయ్య, సుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి శరత్‌బాబు డిమాండ్ చేశారు. ఖమ్మం నెహ్రూనగర్‌లోని పెన్షనర్స్ భవన్‌లో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సకాలంలో వేతనాలు ఇవ్వాలనే డిమాండ్‌తో పాటు డీఏల చెల్లింపు కోసం ఈ నెల 10న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో డీకే శర్మ, వేణు, సాంబశివరావు, జనార్దన్‌రావు, పూర్ణచందర్‌రావు, రాధాకిషన్‌రావు, వీరయ్య, మారంరాజు రాధాకృష్ణారావు, దొడ్డా రమేశ్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్షం ఆధ్వర్యాన రేపు సదస్సు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై చర్చించేందుకు ఈనెల 10వ తేదీన ఖమ్మంలోని సంజీవరెడ్డి భవన్‌లో అఖిలపక్షాల ఆధ్వర్యాన సదస్సు నిర్వహిస్తున్నామని వివిధ పార్టీల నాయకులు వెల్లడించారు. ప్రజాపంథా కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలోసీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకుడు హుస్సేన్, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి అల్లిక వెంకటేశ్వర్లు, న్యూడెమోక్రసీ నాయకుడు గిరి, ఆమ్ ఆద్మీ జిల్లా అధ్యక్షుడు ఎన్.తిరుమలరావు మాట్లాడుతూ ప్రొఫెసర్ కోదండరామ్, ఆకునూరు మురళి తదితరులు హాజరయ్యే సదస్సులో నిరుద్యోగులు, ప్రజలు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు వీరస్వామి, ఆవుల అశోక్, ఆజాద్, మస్తాన్, రాకేష్, వెంకటేష్, ఝాన్సీ పాల్గొన్నారు.

16న లారీ యజమానుల సంఘం ఎన్నికలు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం పట్టణ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 16న జరగనున్నాయి. ఈమేరకు శనివారం నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు ఎన్నికల అధికారి కొత్త వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం వరకు నామినేషన్లను స్వీకరించనుండగా, సోమవారం ఉపసంహరణకు అవకాశం ఇచ్చి అదే రోజు బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. అసోసియేషన్‌లో 485 మంది సభ్యులు ఉండగా మూడేళ్ల కాలపరిమితికి గాను కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారు.

మృతదేహం లభ్యం

ఖమ్మంక్రైం: జిల్లా కేంద్రంలోని మున్నేరులో శనివారం గుర్తుతెలియని వ్యక్తి (30) మృతదేహం లభ్యమైంది. నీళ్ల మధ్యలో మృతదేహం తేలుతుండగా స్థానికులు ఖమ్మం త్రీటౌన్ పోలీసులకు సమాచారమిచ్చారు. వారు అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు సహకారంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. అయితే, మృతుడు స్థానికుడా? లేక ఇతర ప్రాంతాల నుంచి మృతదేహం కొట్టుకొచ్చిందా అనే అంశంపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

తల్లాడ: మండలంలోని నారాయణపురానికి చెందిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మూకర సాయిబాబు (38) ఈ నెల 6న రాత్రి సైకిల్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయం కాగా, ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉండగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

కోవిడ్ కట్టడికి సన్నద్ధత

- పరీక్షల నిర్వహణ, చికిత్సపై అధికారుల దృష్టి
- ఆక్సిజన్ నిల్వలపై నిరంతరం పర్యవేక్షణ
- ఎన్ని కేసులు వచ్చినా వైద్యం అందించేలా చర్యలు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలో కోవిడ్ వ్యాప్తి చెందుతున్న దృష్ట్యా వైద్య యంత్రాంగం కట్టడికి సమాయత్తమైంది. కోవిడ్ బాధితులు పెరిగితే అందుకు తగ్గట్టుగా వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపట్టింది. శనివారం ఖమ్మం జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు ఉద్యోగులతో కలిసి కోవిడ్ వార్డు, ఆర్‌టీపీసీఆర్ ల్యాబ్‌లను పరిశీలించడమే కాక ఎందరు బాధితులు వచ్చినా చికిత్స అందించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాలో వారం రోజుల నుంచి కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి. శుక్రవారం నాటికి 52 కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదు కావడం, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందడంతో ఆందోళన కలిగిస్తోంది. అలాగే, ఆస్పత్రి కోవిడ్ వార్డులో ఐదుగురు, మాతాశిశు సంరక్షణ కేంద్రంలో నలుగురు గర్భిణులు కోవిడ్‌తో చికిత్స తీసుకుంటున్నారు. ఇలా రోజురోజుకూ బాధితుల సంఖ్య పెరుగుతున్నందున మెరుగైన వైద్యం అందించేలా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.



కోవిడ్ వార్డు వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

ముందు జాగ్రత్తగా..

కోవిడ్ బాధితులు రోజురోజుకూ పెరుగుతుండటంతో ముందు జాగ్రత్తగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఖమ్మం జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. కోవిడ్ కట్టడికి తీసుకుంటున్న చర్యలపై ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 30 వెంటిలేటర్ బెడ్లు సిద్ధం చేయగా.. అవసరమైతే మరిన్ని కేటాయిస్తామన్నారు. ఆస్పత్రిలో సుమారు 600 బెడ్ల సామర్థ్యం ఉందని, అన్నింటికీ ఆక్సిజన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా సరిపడేలా ఆక్సిజన్ నిల్వలు సిద్ధం చేశామని, మందులు కూడా ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం ఆర్‌టీపీసీఆర్ ల్యాబ్ ద్వారా నిరంతరం పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యాన అవసరమైతే ర్యాపిడ్ టెస్టులు కూడా పెంచుతామని ఆయన వెల్లడించారు. కాగా, ప్రజలు కోవిడ్‌పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జాగ్రత్తలు పాటిస్తే మేలని చెప్పారు.

ఇఫ్తార్ విందులో మంత్రి పువ్వాడ

నిరుపేద ముస్లింలకు రంజాన్ కిట్ల పంపిణీ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 11వ డివిజన్ మజీద్ – ఏ – మహ్మదీయ మసీద్‌లో శనివారం ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. అభయ వైద్యశాల సీఈఓ డాక్టర్ ఎంఏ కరీం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొని నమాజ్ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఖమ్మం ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని అల్లాను ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం నిరుపేద ముస్లింలకు రంజాన్ కిట్లు, దుస్తులను మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు సయ్యద్ అహ్మద్ కాశ్మీ, అబ్దుల్ ముజీబ్, అబ్దుల్ హమీద్, బీఆర్‌ఎస్ ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ తాజుద్దీన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు షేక్ అఫ్జల్ హసన్, సుడా చైర్మన్ విజయ్, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజుతో పాటు సయ్యద్ ఫరీద్ ఖాద్రీ, శంషుద్దీన్, ఇషాక్, సలీం అహ్మద్, మజీద్, మహమ్మద్ ఫసియుద్దీన్, జానీమియా, గౌస్‌పాషా, జానీమియా, రెహమాన్, జానీ, మహమ్మద్ ఎజాజ్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.



ముస్లింలకు పండ్లు తినిపిస్తున్న మంత్రి అజయ్‌కుమార్

నేడు మంత్రి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదివారం ఖమ్మం జిల్లా కేంద్రంలో పర్యటించనున్నారు. ఖమ్మం గుర్రం జగన్‌మోహన్‌రావు ఫంక్షన్ హాల్‌లో జరిగే బీఆర్‌ఎస్ త్రీటౌన్ కమిటీ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పాల్గొంటారు.

మాజీ ఎంపీ పొంగులేటి పర్యటన

పెనుబల్లి/కల్లూరు: పెనుబల్లి మండలంలోని పలు గ్రామాలతో పాటు కల్లూరులో శనివారం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆయన పరామర్శించారు. అలాగే, పలు శుభకార్యాలకు హాజరయ్యారు. డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, నాయకులు కీసర శ్రీనివాసరెడ్డి, గూడూరు మాధవరెడ్డి, రాజబోయిన కోటేశ్వరరావు, రమేష్, కర్రి సదానందరావు, పిల్లి నవజీవన్, బొర్రా కోటేశ్వరరావు, ఎస్‌కె బాజీ, వంగా దామోదర్‌రావు, మల్లెల రాజా, దొంతు మాధవరావు, యాసా వెంకటేశ్వరరావు, నోటి కృష్ణారెడ్డి, మైబు, ఉస్మాన్, ఉబ్బన శ్రీను, మద్దెబోయిన నాగరాజు, సయ్యద్ అలీ, రవూఫ్, యనుముల శివ తదితరులు పాల్గొన్నారు.



పెనుబల్లి : గంగదేవిపాడులో కుటుంబాన్ని పరామర్శిస్తున్న శ్రీనివాసరెడ్డి

12 నుంచి బీ ఫార్మసీ ఐదో సెమిస్టర్ పరీక్షలు

కేయూక్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఫార్మసీ (సీబీసీఎస్) ఐదో సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఈ నెల 12న పేపర్–1 మెడిసినల్ కెమిస్ట్రీ, 15న పేపర్–2 ఇండస్ట్రియల్ ఫార్మసీ, 18న పేపర్–3 ఫార్మసీ కాలజీ, 20న పేపర్–4 ఫార్మాకాగ్నసీ అండ్ ఫైథోకెమిస్ట్రీ, 24న పేపర్–5 ఫార్మస్యూటికల్ జ్యూరిస్‌ప్రుడెన్స్ పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. నిర్ణీత తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయని వివరించారు.

బీజేపీదే కుటుంబ పాలన

- దేశానికే రోల్‌మోడల్‌గా తెలంగాణ
- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి: దేశంలోని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అనేక మంది ఆ పార్టీ నాయకులు, కుటుంబీకులే పాలిస్తున్నారని.. ఆ పార్టీకి మించిన కుటుంబ పాలన మరొకటి లేదని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. ఈనెల 11న జరగనున్న సత్తుపల్లి మున్సిపల్ స్థాయి ఆత్మీయ సమ్మేళనం కరపత్రాలను శనివారం రాత్రి ఆయన హనుమాన్‌నగర్‌లో ఇంటింటికీ పంపిణీ చేశారు. అనంతరం వందనపు సత్యనారాయణ నివాసంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీరాముడి జపం చేసే బీజేపీ పార్టీ దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం రైల్వేలైన్‌కు నిధులు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. కాగా, ప్రధాన మంత్రి మోదీ హైదరాబాద్ వేదికగా ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనపై విమర్శలు చేయడం గర్హనీయమని ఆయన పేర్కొన్నారు. దేశంలోని ఏ రంగంలోనూ ప్రధాని మోదీ ముద్ర వేయకపోగా.. అన్నిరంగాల్లో దేశానికే మోడల్‌గా తెలంగాణను నిలుపుతున్న కేసీఆర్‌ను విమర్శించడాన్ని మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, వైస్ చైర్మన్ తోట సుజలరాణి, ఆత్మ కమిటీ చైర్మన్ వనమా వాసుతో పాటు కొత్తూరు ఉమామహేశ్వరరావు, నరుకుళ్ల మమత, శ్రీనివాసరావు, మౌలాలీ, అమరవరపు విజయనిర్మల, మొండెద్దు కృష్ణారెడ్డి, సంజీవ్‌రెడ్డి, ఎస్.కే.రఫీ, అంకమరాజు, వీరపనేని బాబీ, అద్దంకి అనిల్, పవన్ పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనం ఆహ్వానపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

నిరుపేద విద్యార్థికి చేయూత

తల్లాడ: తల్లాడ మండలం అన్నారుగూడెంకు చెందిన నిరుపేద విద్యార్థి తంబళ్ల సింధు కేరళలోని పాలక్కాడ్‌లో ఐఐటీ చదువుతుండగా, చేతన ఫౌండేషన్ బాధ్యులు ల్యాప్‌టాప్ సమకూర్చారు. ఈమేరకు ల్యాప్‌టాప్‌ను శనివారం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు దొడ్డా సీతారామయ్య, మాదినేని నర్సింహారావు, చంద్రకాని నవీన్, షేక్ రషీద్, కల్యాణపు సాంబశివరావు, ముత్తినేని సురేష్ పాల్గొన్నారు.

బాలుడిని తల్లిదండ్రుల చెంతకు చేర్చిన చైల్డ్‌లైన్



జశ్వంత్‌ను తల్లికి అప్పగిస్తున్న చైల్డ్‌లైన్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలో తప్పిపోయిన తొమ్మిదేళ్ల బాలుడిని చైల్డ్‌లైన్–1098 బృందం తిరిగి తల్లిదండ్రుల చెంతకు చేర్చింది. చైల్డ్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్ కథనం ప్రకారం.. ఖమ్మం ముస్తఫానగర్ శ్రీరాంనగర్ రోడ్డు నంబర్–108లో జల్లి రాంబాబు – మమత, వారి తొమ్మిదేళ్ల కుమారుడు జశ్వంత్ ఉంటున్నారు. కాగా, వారితోనే ఉండే రాంబాబు తల్లి మైసమ్మ నేలకొండపల్లిలో ఉంటున్న కూతురు ఇంటికి వెళ్లింది. దీంతో జశ్వంత్ నాయనమ్మ వద్దకు వెళ్లాలని నిర్ణయించుకుని శనివారం తల్లిదండ్రులు పనికి వెళ్లాక కాలినడకన బయలుదేరాడు. త్రీటౌన్ ఏరియాలో కాళ్లకు చెప్పులు లేకుండా ఒంటరిగా వెళ్తున్న బాలుడిని ఓ ద్విచక్రదారుడు గమనించి పోలీసులకు అప్పగించాడు. దీంతో పోలీసులు వివరాలు ఆరా తీసినా ఫలితం లేక చైల్డ్‌లైన్‌కు అప్పగించడంతో కోఆర్డినేటర్ శ్రీనివాస్ సెంటర్‌కు తీసుకెళ్లి మాట్లాడగా పాఠశాల పేరు చెప్పడంతో ఎంఈఓకు సమాచారం ఇచ్చారు. అప్పటికే జశ్వంత్ తల్లిదండ్రులు తమ కుమారుడి కోసం వెతుకుతుండగా సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ భారతిరాణి, సభ్యుడు లక్ష్మయ్య ముందు హాజరుపర్చి తల్లిదండ్రులను పిలిచి అప్పగించారు. దీంతో కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్, సభ్యులు అనూష తదితరులను సీడబ్ల్యూసీ బాధ్యులు అభినందించారు.

'లయన్స్' ఆస్పత్రిలో ప్యాకో మిషన్



ప్యాకో మిషన్‌ను ప్రారంభిస్తున్న కాపా చంద్రకళ దంపతులు

వైరా: వైరాలోని లయన్స్ కంటి ఆస్పత్రిలో లేజర్ ప్యాకో మిషన్ అందుబాటులోకి వచ్చింది. ఈ యంత్రాన్ని పీడీజీ డాక్టర్ కాపా మురళీకృష్ణ, డాక్టర్ చంద్రకళ శనివారం ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటి వరకు పట్టణాలకే పరిమితమైన లేజర్ కంటి చికిత్స ఇప్పుడు వైరాలో కూడా అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. వైద్యులు ఉంద్రు శ్యాంబాబు, శ్రీధర్‌గౌడ్, కోటయ్య, భాస్కరరావు, సిద్దార్థ, రవిచంద్రతో పాటు గోపాలరావు, సునీత, ప్రభాకర్‌రావు, విశ్వేశ్వరరావు, కృష్ణారావు, నాగేశ్వరరావు, వెంకటేష్, శ్రీకాంత్, వరలక్ష్మి, నాగి, సత్యంబాబు,శ్రీను, రామకృష్ణ, రామారావు, పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతున్న ప్రభుత్వం

కల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం 30 లక్షల నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతోందని వైఎస్సార్‌టీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గడిపల్లి కవిత ఆరోపించారు. నిరుద్యోగుల సమస్యలపై శనివారం కల్లూరులో దీక్ష చేపట్టగా ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల ప్రాతిపదికన సాధించుకున్న తెలంగాణలో ఉద్యోగ నియామకాలు లేక వందలాది మంది యువత ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. దీనికి తోడు ఇటీవల నిర్వహించిన పరీక్షల ప్రశ్నపత్రాలు లీకేజీ కావడంతో మరింత ఆవేదన చెందుతున్నారని చెప్పారు. ఇకనైనా పేపర్ల లీకేజ్ ఘటనపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. దీక్షలో నాయకులు జెన్నారెడ్డి నరసింహారెడ్డి, కర్నాటి అప్పిరెడ్డి, నూనె స్వామియాదవ్, శివాజీ, అన్వేశ్, సత్తిరెడ్డి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో మాట్లాడుతున్న గడిపల్లి కవిత

వరిగడ్డి దగ్ధం

తిరుమలాయపాలెం: అగ్ని ప్రమాదంతో 200 కట్టలు కలిగిన రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. మండలంలోని మహ్మదాపురం శివారు బోడతండాకు చెందిన రైతు బోడ బిచ్చా పశువుల మేత కోసం గడ్డివాములు వేశాడు. ప్రమాదవశాత్తు శనివారం నిప్పంటుకోవడంతో ఫైర్ ఇంజన్‌కి సమాచారం ఇచ్చారు. వాహనం వచ్చేలోగా గడ్డి పూర్తిగా కాలిపోయిందని రైతు కన్నీరుమున్నీరయ్యాడు.

గణితంలో 'ప్రశ్న' భారం

ఆరు మార్కుల ప్రశ్నతో విద్యార్థుల ఇబ్బందులు

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి విద్యార్థులకు శనివారం గణితశాస్త్రం పరీక్ష నిర్వహించగా, ఆరు మార్కులకు సంబంధించి 14వ ప్రశ్నను సాధించడంలో విద్యార్థులు ఇబ్బంది పడినట్లు తెలుస్తోంది. విద్యార్థులకు బోధించిన అంశాల కంటే రెట్టింపు స్థాయిలో ప్రశ్న రావడంతో మార్కులు వస్తాయా, లేదా అనే మీమాంస నెలకొంది. ఈ ప్రశ్నలకు సమాధానం రాయాలంటే మూడు చరరాశులు కలిగిన మూడు సమీకరణాలను తీసుకొని సాధన చేయాల్సి ఉంటుందని ఉపాధ్యాయవర్గాల ద్వారా తెలిసింది. కానీ పదో తరగతి వరకు రెండు చరరాశుల్లో గల రేఖీయ సమీకరణాల సాధన మాత్రమే ఉన్నందున విద్యార్థులు ఇబ్బంది పడినట్లు సమాచారం. ఈ విషయమై ఖమ్మం డీఈఓ సోమశేఖరశర్మను వివరణ కోరగా 14వ ప్రశ్నకు జవాబు రాబట్టేందుకు విద్యార్థులు ప్రయత్నం చేస్తే పెద్ద కష్టమేమి కాదని గణిత ఉపాధ్యాయుల ద్వారా తెలిసిందని చెప్పారు.

ఇంటర్వ్యూకు పిలిచి.. మత్తుమందు ఇచ్చి..

ఖమ్మంలో వివాహిత నుంచి ఆభరణాలు అపహరణ

ఖమ్మంక్రైం: ఇంటర్వ్యూ పేరుతో ఓ యువతిని పిలిచి మత్తు మందు ఇచ్చాక ఆమె మెడలోని ఆభరణాలు చోరీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలానికి చెందిన దంపతులు ఖమ్మం కాల్వొడ్డు ప్రాంతం బొక్కలగడ్డలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 5న టెలీకాలర్స్ ఉద్యోగాల భర్తీ ప్రకటన పత్రికల్లో రావడంతో అందులోని నంబర్‌కు వివాహిత ఫోన్ చేసింది. దీంతో నెలకు రూ.13,400 నుంచి రూ.22,700 వరకు వేతనం అందుతుందని చెప్పడంతో ఆమె తనతోపాటు ఫ్యాన్సీ షాపులో పనిచేస్తున్న మరో యువతికి చెప్పి ఇద్దరూ ఈ నెల 6న మున్నేరు బైపాస్‌లో ఉన్న కార్యాలయానికి వెళ్లారు. అక్కడ ఉన్న వ్యక్తి మరో ఇద్దరు వచ్చాక ఇంటర్వ్యూ చేస్తామని చెప్పడంతో కార్యాలయ వాతావరణం కనిపించకపోవడంతో వీరు ఆరా తీశారు. దీంతో యువతి పని ఉందని చెప్పి వెళ్లిపోగా వివాహిత అక్కడే ఉంది. అనంతరం అక్కడి వ్యక్తి ఆమెకు బాదం పాలు ఇచ్చినా తీసుకోకపోవడంతో ఎండకు వచ్చావు.. అలిసిపోయావు అంటూ నమ్మబలికి తాగించాడు. ఆ వెంటనే ఆమె మత్తులోకి జారుకోవడంతో అప్పటికే వచ్చిన మరో ఇద్దరితో కలిసి యువతి చేతికి ఉన్న ఉంగరం, మెడలోని నాన్‌తాడు లాక్కుని వెళ్లిపోయారు. గంటన్నర తర్వాత మేల్కొన్న ఆమె అక్కడ ఎవరూ లేకపోవడంతో భర్తకు ఫోన్ చేయగా బంధువులతో కలిసి ఆయన వచ్చి డయల్ 100 ద్వారా ఖమ్మం త్రీటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అక్కడ గుర్తు తెలియని వ్యక్తుల ఆచూకీ లభ్యం కాకపోగా, ఇంటి యజమానిని ప్రశ్నించడంతో సంస్థ కోసం అద్దెకు ఇచ్చానే తప్ప వారెవరో తెలియదని బదులిచ్చాడు. కాగా, బాదం పాలలో మత్తు మందు కలిపి ఇచ్చినట్లు నిర్ధారించిన పోలీసులు, యువతితో మాట్లాడిన వ్యక్తికి సంబంధించిన ఫోన్‌డేటాపై ఆరా తీస్తున్నారు.

బీఆర్‌ఎస్‌లో రెండు వర్గాల వివాదం



వాగ్వాదానికి దిగిన ఇరువర్గాల నాయకులు

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి శనివారం ఘర్షణకు దిగారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. అభివృద్ధి పనుల్లో భాగంగా సర్పంచ్ దండా పుల్లయ్య ఆధ్వర్యాన పాత బస్టాండ్‌ను శనివారం తొలగించారు. దీనికి ఆనుకుని ఉన్న బీఆర్‌ఎస్, టీడీపీ జెండాల దిమ్మెలను కూడా తీసేశారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, ఎంపీటీసీ సభ్యురాలు జటంగి చంద్రమ్మ, సొసైటీ చైర్మన్ తన్నీరు కృష్ణమూర్తి తదితరులు శనివారం రాత్రి కూసుమంచి – నేలకొండపల్లి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. అక్కడకు సర్పంచ్ వర్గీయులు కూడా చేరుకోవడంతో వాగ్వాదం జరిగింది. కాగా, ఆందోళనతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో కూసుమంచి సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్‌ఐ జి.స్రవంతి చేరుకుని ఇరువర్గాలతో చర్చించారు. ఫిర్యాదు చేస్తే విచారణ జరుపుతామని చెప్పడంతో వారు రెండు గంటల అనంతరం ఆందోళన విరమించారు.

భార్యను కొట్టి చిన్నారిని ఎత్తుకెళ్లిన భర్త

కారేపల్లి: భార్యను కొట్టి, కుమారుడిని ఎత్తుకెళ్లిన వ్యక్తిపై కారేపల్లి పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని గేటుకారేపల్లికి చెందిన మేఘనకు సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన చింత ముత్యాలుకు కొన్నేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. ఆరు నెలల నుంచి మేఘనపై ముత్యాలు వేధింపులకు పాల్పడుతున్నాడు. దీంతో ఆమె కుమారుడితో సహా గేటుకారేపల్లిలోని తల్లిగారింటికి వచ్చింది. గత నెల 29వ తేదీన గేటుకారేపల్లికి వచ్చిన ముత్యాలు.. భార్య మేఘనను కొట్టి బాబును ఎత్తుకెళ్లడమే కాక పెద్దలు పంచాయతీకి పిలిచినా రాలేదు. దీంతో మేఘన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పి.రామారావు తెలిపారు.

అధికారంలోకి వచ్చేది బీజేపీనే..

పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ

ఖమ్మం మామిళ్లగూడెం: ఎప్పుడు ఎన్నికలు జరిగినా తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన బహిరంగ సభలో ప్రధాని నరేంద్రమోదీ పాల్గొనగా.. జిల్లా నుంచి పార్టీ శ్రేణులు బయలుదేరారు. ఈసందర్భంగా బైపాస్ రోడ్డులో వాహనాల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన సత్యనారాయణ మాట్లాడుతూ బండి సంజయ్‌ను అక్రమంగా అరెస్టు చేసినంత మాత్రాన నాయకులు భయపడకపోగా రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తారని అన్నారు. తెలంగాణ అభివృద్ధికి మోదీ రూ.వేల కోట్లు కేటాయించడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రధాని పర్యటనలో ఖమ్మం – దేవరపల్లి జాతీయ రహదారి పనులకు కూడా శంకుస్థాపన చేశారని చెప్పారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు రుద్ర ప్రదీప్, శ్యాంరాథోడ్, అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్‌తో పాటు నాయకులు పసుమర్తి సతీష్, నంబూరి రామలింగేశ్వరావు, ఏలూరి నాగేశ్వరావు, కోటేశ్వరావు, మందా సరస్వతి, గుత్తా వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, వెంకట్, లక్ష్మీనారాయణగుప్తా తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ బయలుదేరుతున్న సత్యనారాయణ, నాయకులు

క్లుప్తంగా...

అమిత్ షాతో నల్లారి భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీలో చేరిన మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి శనివారం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో జరిగిన ఈ భేటీలో సంస్థాగత వ్యవహారాల పార్టీ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మై, మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత పార్టీ పరిస్థితులతో పాటు కర్ణాటక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. తెలుగు ప్రజలు ఎక్కువగా ఉండే నియోజకవర్గాల్లో ఏపీ నేతల ప్రచారంపైనా చర్చించినట్టు చెబుతున్నారు. ఇక కిరణ్‌కుమార్‌రెడ్డి చేరిక కార్యక్రమానికి దూరంగా ఉన్న రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు సైతం శనివారం సాయంత్రానికి ఢిల్లీ చేరుకున్నారు. అనంతరం కిరణ్‌కుమార్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఇద్దరు నేతలు పలు అంశాలపై చర్చించుకున్న అనంతరం బీజేపీలోని మరికొంత మంది నేతలను కలిసినట్టుగా తెలిసింది.

'ఉపాధి' అనుసంధానానికి పోస్టుకార్డు ఉద్యమం

దుగ్గొండి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన పోస్టుకార్డుల ఉద్యమం శనివారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మహ్మదాపురం గ్రామంలో ప్రారంభమైంది. మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రికి పోస్టు కార్డులు వేశారు. కేంద్రంపై పోరాటానికి మహ్మదాపురం వేదిక అయిందని, ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం సాగుతుందని ఎర్రబెల్లి తెలిపారు. గిరిజన యూనివర్సిటీ, కోచ్ ఫ్యాక్టరీ, ఇవ్వకుండా ఏ మొహం పెట్టుకొని ప్రధాని వచ్చారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు.

చిరుధాన్యాల ఎగుమతులు పెరగాలి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఏపీ నుంచి వ్యవసాయ, ప్రాసెస్డ్ ఫుడ్ ఉత్పత్తుల ఎగుమతులను పెంచేందుకు అవకాశాలు ఉన్నాయని అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అన్నారు. 2023ను ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్‌గా ప్రకటించిన నేపథ్యంలో చిరుధాన్యాల ఎగుమతికి ఉన్న అవకాశాలను ఉపయోగించుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని ఎపెడా ప్రాంతీయ కార్యాలయంలో తెలంగాణలోని చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, ప్రాసెస్డ్ ఫుడ్, పండ్లు తదితర రంగాలకు చెందిన ఎగుమతిదారులతో శనివారం సమావేశం నిర్వహించారు.

రూ. కోట్లు కొల్లగొట్టిన ఐపీజీ రెంట్!

- రెట్టింపు సొమ్ము పేరుతో నల్లగొండ జిల్లాలో దోపిడీ
- మునుగోడు మండలం పలివెలలో మోసపోయిన ప్రజలు
- మొదట్లో తక్కువ మొత్తం పెట్టిన కొందరికి రెట్టింపుతో తిరిగి చెల్లింపు
- పెట్టుబడి పెట్టే వారి సంఖ్య వందలకు చేరడంతో కుచ్చుటోపీ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ/మునుగోడు: సైబర్ మోసగాళ్లు ఐపీజీ రెంట్ యాప్ పేరుతో కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. పెట్టిన పెట్టుబడికి వారం రోజుల్లోనే రెట్టింపు వడ్డీ వస్తుందని ఆశ చూపించడంతో డబ్బులు పెట్టిన వందల మంది మోసపోయారు. హైదరాబాద్‌తోపాటు నల్లగొండ జిల్లాలోని పలివెలలో ఈ యాప్‌లో పెట్టుబడి పెట్టి డబ్బులు కోల్పోయిన బాధితులు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. మొదట్లో ఒకరిద్దరుగా ఉన్నప్పుడు రెట్టింపు డబ్బులను తిరిగి పంపించిన యాప్ నిర్వాహకులు.. పెట్టుబడి పెట్టిన వారి సంఖ్య వందలకు చేరుకోవడంతో ముఖం చాటేశారు. ఐపీజీరెంట్.కామ్ పేరుతో ఉన్న వెబ్‌సైట్‌ను మూసేశారు. దీంతో బాధితులు ఇప్పుడు పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమయ్యారు.

పలివెలకు ఎలా పాకిందంటే..

పలివెల గ్రామానికి చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌లోని తన స్నేహితుడు పంపిన లింక్ ద్వారా ఐపీజీ యాప్‌లో 20 రోజుల కిందట రిజిస్టర్ చేసుకున్నాడు. హైదరాబాద్‌లో చాలా మంది పెట్టుబడి పెట్టారని, మంచి లాభం వస్తోందని తన స్నేహితుడు చెప్పడంతో అతను పలివెలకు వచ్చి ఈ విషయాన్ని తన స్నేహితులకు తెలియజేశాడు. దీంతో 15 రోజుల కిందట 10 మంది చేరారు. కొందరు రూ.2వేలు, మరికొందరు రూ.5 వేలు, ఇంకొందరు రూ.10 వేల చొప్పున పెట్టుబడి పెట్టారు. అలా పెట్టినవారికి వారం కిందటి వరకు చెప్పిన ప్రకారం వడ్డీతో పాటు అసలు జమ చేశారు. ఈ విషయం తెలిసి ఆ గ్రామంలో పలువురు ఒకరి తరువాత మరొకరు 150 మందికి పైగా రిజిస్టర్ చేసుకొని డబ్బులు పెట్టారు. గత శని, ఆదివారాల్లో రూ.30 వేలు పెట్టుబడి పెట్టిన వారికి అదనంగా రూ.30 వేలు కలిపి ఇస్తామని, వారం రోజులకు వడ్డీ రూ.27వేలు కలిపి మొత్తంగా రూ.87వేలు ఇస్తామని ఆశ చూపారు. దీంతో రూ.50 వేల నుంచి రూ.90 వేల చొప్పున పెట్టుబడి పెట్టారు. అయితే, మోసగాళ్లు ఈ నెల 5వ తేదీ నుంచి ముఖం చాటేశారు. ఫోన్‌చేస్తే సమాధానం రావడం లేదు. యాప్‌ను, వెబ్‌సైట్‌ను మూసేశారు. దీంతో డబ్బులు పెట్టిన వారంతా ఆందోళన చెందుతున్నారు

రూ.80 వేలు పెట్టి మోసపోయా



ఐపీజీలో పెట్టుబడి పెడితే అధిక వడ్డీ వస్తుందని ఆశపడి పది రోజుల కిందట చేరా. మొదట రూ. 2 వేలు పెట్టాను. వాటికి వడ్డీ, అసలు జమచేశారు. తిరిగి రూ.5 వేలు, రూ.10 వేల చొప్పున పెట్టా. అవీ వచ్చాయి. గత శనివారం రూ.30 వేలు, రూ. 50 వేలు పెడితే పెట్టిన నగదుకు డబుల్ వస్తాయని ఆశ చూపించారు. దీంతో రూ.80 వేలు పెట్టాను. ఆ తరువాత యాప్ ఓపెన్ కావడం లేదు.

– అనగంటి కృష్ణ, పలివెల

రూ. లక్షకు పైగా పోయాయి



మా గ్రామంలో చాలా మంది ఐపీజీలో చేరడంతో నేనూ వారం కిందట చేరాను. అందరిలాగే నేను మొదట్లో కొద్ది మొత్తం పెట్టాను. అవి రావడంతో రూ.1 లక్షకు పైగా పెట్టాను. ఆ తరువాత 3 రోజుల నుంచి యాప్ ఓపెన్ కావడం లేదు. ఐపీజీ ఏజెంట్ నంబరుకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోంది.

– రూపని బాలరాజు



తిరుమల శ్రీవారిని శనివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రాజేశ్వరరావు, జస్టిస్ శ్రీదేవి, తెలంగాణ ఎన్నికల కమిషనర్ పార్థసారథి దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వీరికి వేద ఆశీర్వచనం అందించారు. –తిరుమల

శ్రీవారి దర్శనం కోసం 40 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శనివారం ఔటర్ రింగ్ రోడ్డు, శిలా తోరణం వరకు క్యూలు కిక్కిరిసిపోయాయి. వరుస సెలవులకు వారాంతపు రద్దీ తోడవడంతో మాతృశ్రీ తరి గొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం, తిరుమలలోని అన్నప్రసాద కౌంటర్లు, నారాయణగిరి ఉద్యానవనాలలో భక్తుల రద్దీనెలకొంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు దాదాపు 50 వేల మంది యాత్రికులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల అధిక రద్దీ కారణంగా రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టోకెన్లు, ఎస్ఎస్‌డీ టోకెన్లు, దివ్య దర్శనం టోకెన్లు కలిగిన భక్తులు మాత్రమే తిరుమలకు రావాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కాగా, తిరుమల శ్రీవారిని శుక్రవారం 71,782 మంది దర్శించుకున్నారు. హుండీలో రూ.3.28 కోట్లు వేశారు. శ్రీవారి దర్శనానికి 40 గంటల సమయం పడుతోంది.

టీఎస్‌పీఎస్సీ సభ్యులంతా కేసీఆర్ అనుచరులే..

- అందుకే ప్రభుత్వం వారిని కాపాడుతోంది
- కొత్త కమిషన్ ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించాలి
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్



నేరెళ్లలో బాధిత దళితులతో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

సిరిసిల్ల: టీఎస్‌పీఎస్సీ సభ్యులంతా సీఎం కేసీఆర్ అనుచరులేనని, పేపర్ల లీకేజీ కేసులో ప్రభుత్వం వారిని కాపాడేందుకు ప్రయత్నిస్తోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. శనివారం ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లాలో అంబేడ్కర్, కాన్షీరాం విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభల్లో మాట్లాడుతూ, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, సభ్యులు లింగారెడ్డి, సుమిత్ర, కారెం రవీందర్‌రెడ్డి, సత్యనారాయణ.. అందరూ కేసీఆర్ అనుచరులేనన్నారు. వీరి కాల్‌డాటాను తీయాలని, అలాగే టాప్ 500 ర్యాంకర్ల వివరాలను బయటకు తీయాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్, డీజీపీ, కమిషన్ చైర్మన్‌లు ఎందుకు విలేకరుల సమావేశం పెట్టడం లేదని ప్రశ్నించారు. ప్రస్తుత కమిషన్‌ను రద్దు చేయాలని, కొత్త కమిషన్ ఏర్పాటు చేసి పరీక్షలు పెట్టాలని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై ఈనెల 18న అఖిల పక్షాల ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేస్తామని ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు.

సిరిసిల్లకు ఎన్ని పరిశ్రమలు వచ్చాయి?

ఐటీ మంత్రి కేటీఆర్ సిరిసిల్లకు ఎన్ని పరిశ్రమలు తెచ్చారని, ఎన్ని కంపెనీలు వచ్చాయని ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కవిత ఏమైనా స్వాతంత్ర్య సమరయోధురాలా? అని ఎద్దేవా చేశారు. ఆమె జైలుకు వెళుతుందన్న భయంతో ఇక్కడ 30 లక్షల మంది నిరుద్యోగ యువతను వదిలి కేటీఆర్ ఢిల్లీకి వెళ్లారని ధ్వజమెత్తారు. అదనపు అడ్వొకేట్ జనరల్ ప్రభుత్వ ఉద్యోగి అన్న విషయం మరచి, కవిత కోసం ఢిల్లీకి ఎలా వెళ్లారన్నారు. సీఎం కేసీఆర్‌కు పంజాబ్, జార్ఖండ్‌లో మాత్రమే రైతులు కనిపిస్తున్నారని, ఇక్కడ నేరెళ్ల దళితులు ఎందుకు కనిపించడం లేదని అన్నారు.

కల్తీ కల్లు కలకలం

- మహబూబ్‌నగర్‌లో ఘటన

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఉమ్మడి పాలమూరులో కల్తీ కల్లు కలకలం సృష్టించింది. మహబూబ్‌నగర్ పట్టణ శివారు కోయనగర్, మోతీనగర్, దొడ్డలోనిపల్లి ప్రాంతాలకి చెందిన కల్తీ కల్లు బాధితులు 10మంది పిచ్చిపిచ్చిగా ప్రవర్తించడంతో వారి బంధువులు శుక్రవారం జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఆస్పత్రిలో చేర్పించారు. వీరిలో తొమ్మిది మంది కోలుకోగా వారిని శనివారం ఇంటికి పంపించారు. మిగతా ఒకరికి చికిత్స అందిస్తున్నామని, ఆల్కహాలిక్ విత్‌డ్రాయల్ సిండ్రోమ్‌తో బాధపడుతున్నారని, ఎటువంటి ప్రాణాపాయం లేదని ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంకిషన్ తెలిపారు.

మోతాదు తగ్గించడంతోనేనా?: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా కల్లు విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. ఈత వనాలు ఉన్నా, లేకున్నా.. మత్తు కోసం కల్లులో నిషేధిత అల్ప్రాజోలం, క్లోరోహైడ్రేట్, డైజోఫాంలను కలపడం ఇక్కడ పరిపాటిగా మారింది. ప్రస్తుతం ఆల్ప్రాజోలంనే ఎక్కువగా వినియోగిస్తున్నారు. తాజాగా అస్వస్థతకు గురైన బాధితులు మహబూబ్‌నగర్ పట్టణ శివారులో కల్తీ కల్లు దందాకు కేరాఫ్‌గా నిలిచిన కాంపౌండ్‌లలో తాగినట్లు తెలిసింది.

18న రామప్ప వారసత్వ దినోత్సవాలు

పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్/హనుమకొండ: ఈ నెల 18న ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా రామప్ప దేవాలయంలో జరిగే మెగా వేడుకల వాల్ పోస్టర్‌ను రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక కళావైభవం వేడుకలను రామప్ప దేవాలయంలో పర్యాటకులను ఆకర్షించేవిధంగా నిర్వహిస్తామన్నారు. ఈ వేడుకలకు ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్, ప్రముఖ డ్రమ్స్ వాయిద్యకారుడు శివమణి, సింగర్ కార్తీక్, ఫ్లూటిస్టు నవీన్‌పాటు 300 మంది కళాకారులు సంగీతవిభావరి నిర్వహించేలా సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ కృషితో 800 ఏళ్ల చారిత్రక కాకతీయ కళాసంపద రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు లభించిందన్నారు. తెలంగాణలో రామప్ప దేవాలయంతోపాటు యునెస్కో ప్రపంచ వారసత్వకట్టడాల గుర్తింపునకు అర్హత కలిగిన మరో 10 నుంచి 15 చారిత్రక, వారసత్వ కట్టడాలు, ప్రదేశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని కృష్ణా మండలం ముడుమాలలోని 3 వేల ఏళ్లనాటి ఆదిమానవుల ఆనవాళ్లు, నిలువురాళ్ల సమాధులు, నల్లగొండ జిల్లా పానగల్లు గ్రామంలోని శ్రీ ఛాయసోమేశ్వర దేవాలయాన్ని ప్రపంచ వారసత్వసంపద గుర్తింపు కోసం ప్రతిపాదనలు సమర్పించామన్నారు. తెలంగాణలో ఉన్న సాంస్కృతిక, వారసత్వ ప్రదేశాలు, చిహ్నాల ప్రాముఖ్యత గురించిన అవగాహన, పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు.

వేడుకలో 'బలగం'చిత్ర ప్రదర్శన

'శిల్పం వర్ణం కృష్ణం'పేరిట రామప్ప దేవాలయంలో జరిగే వారసత్వ దినోత్సవాల పోస్టర్‌ను హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, గిరిజన, మహిళ సంక్షేమ శాఖమంత్రి సత్యవతి రాథోడ్ ఆవిష్కరించారు. వేడుకలకు 'బలగం'చిత్ర యూనిట్‌ను ఆహ్వానించి ఆ సినిమాను కూడా ప్రదర్శించనున్నట్లు ఎర్రబెల్లి తెలిపారు. రామప్ప సరస్సు సమీపంలో ఫుడ్ ఫెస్టివల్, సాయంత్రం పెద్దఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి సత్యవతి తెలిపారు.

జిల్లా వార్తలు

పామాయిల్ గెలలు అప్పారావుపేటకే...

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట: అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీకి రైతులు ఈ నెల 10 నుంచి పామాయిల్ గెలలను తీసుకురావొద్దని ఆయిల్‌ఫెడ్ డివిజనల్ మేనేజర్ ఏ.బాలకృష్ణ సూచించారు. ఫ్యాక్టరీలో వార్షిక నిర్వహణ చేపట్టనున్నందున పనులు ముగిసే వరకు గెలలను క్రషింగ్‌కు తీసుకురావొద్దని తెలిపారు. అప్పటివరకు రైతులు దమ్మపేట మండలం అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీకి గెలలు తీసుకురావాలని మేనేజర్ కల్యాణ్ వేర్వేరు ప్రకటనల్లో కోరారు.

నేడు ఎంపీ నామ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఆదివారం పర్యటించనున్నారు. ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి, ఖమ్మంలో జరిగే బీఆర్‌ఎస్ ఆత్మీయ సమావేశాల్లో ఆయన పాల్గొంటారు. అలాగే, కొత్తగూడెంలో కూడా పర్యటించనున్న ఎంపీ పలువురి కుటుంబాలను పరామర్శిస్తారు.

పూలే జయంతి కమిటీ వైస్ చైర్‌పర్సన్‌గా షకీనా



ఖమ్మంమామిళ్లగూడెం: రాష్ట్ర ప్రభుత్వం మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని ఈ నెల 11న అధికారికంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రస్థాయిలో నిర్వహణ కమిటీని నియమించగా, వైస్ చైర్‌పర్సన్‌గా ఖమ్మానికి చెందిన షేక్ షకీనా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మంత్రులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సేవాలోపంపై జరిమానా

ఖమ్మంలీగల్: వినియోగదారుడికి తలెత్తిన సేవాలోపంపై సత్తుపల్లిలోని కపిల్ చిట్స్(కోస్తా)కు రూ.15 వేలు జరిమానా విధిస్తూ వినియోగదారుల కమిషన్ సభ్యురాలు ఎ.మాధవీలత శనివారం తీర్పు చెప్పారు. న్యాయవాది ఇమ్మడి లక్ష్మీనారాయణ కథనం ప్రకారం.. తల్లాడకు చెందిన విద్యుత్ శాఖ ఉద్యోగి నారపోగు శ్రీనివాసరావు సత్తుపల్లిలోని కపిల్ చిట్స్(కోస్తా)లో రూ.5 లక్షల చీటీ వేశాడు. గడువు ముగిసినా డబ్బు ఇవ్వకపోవడంతో ఆయన వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. అయితే, గతంలో శ్రీనివాసరావు ష్యూరిటీ సంతకం పెట్టడంతో డబ్బులు అటు మళ్లించినట్లు నిర్వాహకులు చెప్పగా, సమాచారం ఇవ్వకపోవడాన్ని నేరంగా పరిగణిస్తూ సేవాలోపం కింద రూ.10 వేలు, లిటిగేషన్ ఖర్చుల కింద రూ.5 వేలు చెల్లించాలని తీర్పు చెప్పారు.

యాతాలకుంట టన్నెల్ పనులు షురూ..



యాతాలకుంట సమీపాన టన్నెల్ నిర్మాణానికి ముగ్గు పోస్తున్న కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు

- భూనిర్వాసితుల ఖాతాల్లో పరిహారం జమ
- పనులు మొదలుపెట్టిన కాంట్రాక్టర్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మంతో పాటు మహబూబాబాద్ జిల్లా రైతులకు సాగునీరు అందించేందుకు సీతారామ ప్రాజెక్టులో భాగంగా యాతాలకుంట వద్ద టన్నెల్ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ ప్రాంతానికి చెందిన భూనిర్వాసితుల ఖాతాల్లో పరిహారం జమ కావడంతో కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టారు. మూడేళ్లుగా ఈ పనులు పెండింగ్‌లో ఉండడంతో ఇటీవల మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి చర్చించారు. టన్నెల్ పూర్తయితేనే బేతుపల్లి చెరువులోకి నీరు వస్తుందని వివరించడంతోపాటు అక్కడ చేపట్టాల్సిన పనులను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన సీఎం అధికారులను ఆదేశించడమేకాక మంత్రి హరీశ్‌రావు పనులపై సమీక్షించారు. ఈ నేపథ్యాన భూనిర్వాసితులకు సుమారు రూ.5 కోట్ల పరిహారం అందింది. ఈక్రమంలో కాంట్రాక్టర్ యాతాలకుంట సమీపాన టన్నెల్ నిర్మాణానికి ఉపక్రమించగా, నిర్మాణ సామగ్రి చేరవేసి పనులు మొదలుపెట్టారు.

టన్నెలే ప్రధానం

కమలాపురం పంప్‌హౌస్ నుంచి వచ్చే సీతారామ ప్రాజెక్టు నీరు బేతుపల్లి చెరువులోకి రావాలంటే యాతాలకుంట వద్ద నిర్మించే టన్నెల్ కీలకం. కిలోమీటర్ మేర ఉండే ఈ టన్నెల్ నిర్మాణం పూర్తయితే నీరు అక్కడ నుంచి రుద్రాక్షపల్లి, బుగ్గపాడు, నాగుపల్లి మీదుగా బేతుపల్లి చెరువులోకి చేరుతుంది. దీంతోపాటు అనేక చెరువులు, లంకాసాగర్ ప్రాజెక్టులోకి కూడా నీరు పుష్కలంగా చేరనుంది. ఈ టన్నెల్ పనులు ప్రారంభం కావడంతో త్వరలోనే సత్తుపల్లి ప్రాంతానికి సీతారామ నీరు వచ్చి చేరేందుకు వీలు ఏర్పడనుందని భావిస్తున్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు..

పెండింగ్‌లో ఉన్న టన్నెల్‌తోపాటు చిన్నచిన్న పనులు పూర్తి చేస్తే సత్తుపల్లి ప్రాంతానికి సీతారామ నీరు అందుతుంది. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా మంత్రి హరీశ్‌రావును సమీక్షించాలని సూచించి అధికారులతో చర్చించారు. ఆవెంటనే నిర్వాసితుల ఖాతాల్లో పరిహారం జమ కావడంతో కాంట్రాక్టర్ పనులు చేపట్టేందుకు ముందుకొచ్చారు. నా వినతిపై వెంటనే స్పందించి పనులు చేపట్టేలా చర్యలకు ఆదేశించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు.

– తుమ్మల నాగేశ్వరరావు, మాజీ మంత్రి

మతోన్మాద రాజకీయాలను తిప్పికొట్టాల్సిందే..

- పాలేరులో బీఆర్‌ఎస్ పొత్తుతో సీపీఎం పోటీ
- కమ్యూనిస్టులు లేకుండా బీఆర్‌ఎస్ గెలవడం అసాధ్యం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



ఖమ్మంరూరల్: తమ్మినేని వీరభద్రానికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

ఖమ్మంరూరల్/తిరుమలాయపాలెం/కూసుమంచి: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మతోన్మాద రాజకీయాలను తిప్పికొట్టేందుకు పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో శనివారం పర్యటించిన ఆయన పలువురు కార్యకర్తలను పరామర్శించారు. అలాగే, పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించగా వివిధ కాలనీల ప్రజలు తమ సమస్యలపై తమ్మినేనికి వినతిపత్రాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో వీరభద్రం మాట్లాడుతూ.. దేశంలో మతోన్మాదం పెరిగిపోగా, బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదని ఆరోపించారు. దీనికి తోడు ప్రభుత్వాలను కూల్చే కుట్ర చేస్తున్న ప్రధాని నరేంద్రమోదీ హైదరాబాద్ పర్యటనకు ఎలా వచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న బీఆర్‌ఎస్‌తో కలిసి రానున్న ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు వెల్లడించారు. కాగా, పాలేరులో సీపీఎం అభ్యర్థిని గెలిపించేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని, బీఆర్‌ఎస్‌తో పొత్తుతో పాలేరులో సీపీఎం పోటీ చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. పాలేరు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి పాటుపడతామని తెలిపారు. కాగా, గత ఎన్నికల్లో సీపీఐ ఓట్లతో గెలిచిన విషయాన్ని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి మరిచిపోయారా? అని తమ్మినేని ప్రశ్నించారు. ఎన్నికల నాటికి పొత్తుపై స్పష్టత వస్తుందని, కమ్యూనిస్టులు లేకుండా జిల్లాలో బీఆర్‌ఎస్ గెలవడం అసాధ్యమని ఆయన చెప్పారు. కార్యక్రమాల్లో సీపీఎం నాయకులు రమేష్, బషీరుద్దీన్, నండ్ర ప్రసాద్, వి.సుదర్శన్‌రెడ్డి, వై.ప్రసాద్‌రావు, పి.మోహన్‌రావు, అంబటి వెంకటేశ్వర్లు, దండ్యాల రవి, సైదులు, ఎడవెల్లి రమణారెడ్డి, గురుమూర్తి, హన్మంతరావు, గంగాధర్, రాజు, కర్ణబాబు, గన్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి సమ్మేళనానికి జూపల్లి..

- నేడు కొత్తగూడెం రానున్న మాజీ మంత్రి కృష్ణారావు
- అనుచరులతో కలిసి వచ్చేందుకు వందకు పైగా వాహనాలు సిద్ధం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యాన కొత్తగూడెంలో ఆదివారం నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనానికి మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు జూపల్లి కృష్ణారావు హాజరుకానున్నారు. ఈ సమ్మేళనం వేదికగా జూపల్లి తన గళం వినిపించే అవకాశమున్నట్లు సమాచారం. ఇందుకోసం సుమారు వంద వాహనాల్లో కొల్లాపూర్ నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు బయలుదేరేందుకు సిద్ధమవుతున్నారు. సీనియర్ రాజకీయ నేత, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన జూపల్లి గత ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. అప్పుడు కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న బీరం హర్షవర్ధన్‌రెడ్డి తర్వాత బీఆర్‌ఎస్ పార్టీలో చేరినప్పటి నుంచి పార్టీలోనే అంతర్గత పోరు కొనసాగుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ జూపల్లి ఏ పార్టీలో చేరనున్నారన్న దానిపై ఉత్కంఠ నెలకొనగా.. కొంతకాలంగా బీఆర్‌ఎస్, సీఎం కేసీఆర్‌పై విమర్శలు గుప్పిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమ్మేళనానికి ఆయన హాజరుకానుండటం ఆసక్తి రేపుతోంది.

ఆచితూచి అడుగులు..

గత ఎన్నికల్లో జూపల్లి ఓటమి పాలయ్యాక ఆయన ప్రత్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇరువురు ఒకే పార్టీలో ఉన్నా అంటీముట్టనట్టుగానే వ్యవహరిస్తున్నారు. తన అనుచరులను ఎమ్మెల్యే వేధిస్తున్నారని విమర్శలు గుప్పిస్తున్న జూపల్లి.. కొల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో కేఎల్ఐ కాల్వ సమస్యలపై రైతులతో కలిసి నిరసన తెలుపుతున్నా, పార్టీ మార్పుపై మాత్రం ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఇదేసమయాన ఖమ్మం మాజీ ఎంపీ కూడా పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ ఏడాది జనవరి నుంచి బీఆర్‌ఎస్‌తో పాటు సీఎం కేసీఆర్‌పై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఆయన పార్టీ మారగడం తథ్యమేనని తెలుస్తున్నా.. ఏ పార్టీలో చేరతారనే నిర్ణయాన్ని ఇప్పటివరకు వెల్లడించలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాల్లో భాగంగా కొత్తగూడెంలో ఆదివారం సమావేశం ఏర్పాటుచేయగా.. మాజీ మంత్రి జూపల్లి అనుచరులతో ఈ సభకు హాజరవుతుండడం గమనార్హం.

కేసీఆర్‌వన్నీ మాయమాటలే

- మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- మధిర, ఎర్రుపాలెం, బోనకల్‌ల్లో క్యాంపు కార్యాలయాల ప్రారంభం



మధిర: మాట్లాడుతున్న మాజీ ఎంపీ శ్రీనివాసరెడ్డి

మధిర: తెలంగాణ ప్రజలను ముఖ్యమంత్రి కేసీఆర్ మాయమాటలతో మోసం చేస్తూ కాలం గడుపుతున్నారని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. మధిర, ఎర్రుపాలెం, బోనకల్‌లో ఏర్పాటుచేసిన క్యాంపు కార్యాలయాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశాల్లో పొంగులేటి మాట్లాడుతూ మిగులు నిధులతో ఏర్పడిన తెలంగాణను కేసీఆర్ అప్పుల కుప్పగా మార్చారని మండిపడ్డారు. అలవికాని హామీలతో రెండు సార్లు అధికారం చేపట్టగా, ఇంకోసారి గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా లేరని తెలిపారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీలో ప్రభుత్వ పెద్దల హస్తం ఉన్నందున సిట్‌తో కాకుండా సీబీఐ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, ఇటీవల సీఎం జిల్లా పర్యటనకు వచ్చిన సమయాన పంట నష్టపోయిన రైతులకు ప్రకటించిన పరిహారం నేటికీ అందలేదన్నారు. అలాగే, రైతుల రుణమాఫీ చేయకపోగా, సబ్సిడీ యంత్రాలు ఇవ్వటం లేదని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించలేక పోతున్నారని చెప్పారు. కాగా, అధికారాన్ని అడ్డు పెట్టుకుని కొందరు బీఆర్‌ఎస్ నాయకులు తన అభిమానులను బెదిరిస్తే సహించేది లేదని పొంగులేటి హెచ్చరించారు. అన్ని నియోజకవర్గాల్లో ఆత్మీయ సమ్మేళనాలు పూర్తికాగానే ఈనెలాఖరుకల్లా ప్రజాభీష్టం, కార్యకర్తల అభిప్రాయాల మేరకు ఏపార్టీలో చేరేది వెల్లడిస్తానని తెలిపారు. అప్పటి వరకు ప్రజలకు అందుబాటులో ఉండేందుకే మండల కేంద్రాల్లో క్యాంపు కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు పొంగులేటి వివరించారు.

జెడ్పీ చైర్మన్ వివక్ష

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంట నడుస్తున్నందున తనపై జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ వివక్ష చూపుతున్నారని ఎర్రుపాలెం జెడ్పీటీసీ సభ్యురాలు శీలం కవిత ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా ఒక్కో జెడ్పీటీసీకీ రూ.60 లక్షల నిధులు కేటాయించి తనకు మాత్రం రూ.20 లక్షల కేటాయించారని తెలిపారు. అలాగే, జమలాపురం పుణ్యక్షేత్రానికి వెళ్లే బీటీ రోడ్డుకు నిధులు మంజూరైనా ఉద్దేశపూర్వకంగా ప్రొసీడింగ్స్ నిలిపివేశారని ఆరోపించారు. కాగా, క్యాంపు కార్యాలయాల ప్రారంభానికి హాజరైన పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభిమానులు ఘన స్వాగతం పలకడంతో పాటు బైక్ ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో డాక్టర్ కోట రాంబాబు, డీసీసీబీ డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, మధిర కౌన్సిలర్ యర్రగుంట లక్ష్మి, నాయకులు, ప్రజాప్రతినిధులు దేవిశెట్టి రంగారావు, మందడపు తిరుమల్‌రావు, చిలకా వెంకటేశ్వరరావు, యన్నం కోటేశ్వరరావు, చావలి రామరాజు, రవికాంత్, యర్రగుంట రమేశ్, వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, అంకసాల శ్రీనివాసరావు, బండి వెంకటేశ్వర్లు, గూడూరు రమణారెడ్డి, కొత్తపల్లి విద్యాసాగర్, శీలం అక్కిరెడ్డి, శీలం జయలక్ష్మి, కూరపాటి యశోద, అప్పమ్మ, శీలం వెంకట్రాంరెడ్డి, లక్కిరెడ్డి నర్సిరెడ్డి, బుర్రా నారాయణ, గూడూరు రమణారెడ్డి, వేమిరెడ్డి త్రివేణి, సామనూరి కృష్ణార్జున్‌రాజు, గూడూరు నర్సింహారెడ్డి, శీలం ఉమామహేశ్వరి, శీలం అక్కమ్మ, సైదానాయక్, చిలకా వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మి, ఉమ్మినేని కృష్ణ, బాగం నాగేశ్వరరావు, బండి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.